ప్రజా సమస్యల పరిష్కారానికి- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

99 రోజుల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం
రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

విశ్వంభర, నల్గొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. గురువారం ఆయన నల్గొండ జిల్లా, తిప్పర్తి మండల కేంద్రంలో రైతు వేదిక ఆవరణలో నిర్వహించిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక గ్రామ సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు .రానున్న మూడేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు,సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాలను అమలు చేసి గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరిస్తామని, అందుకే ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. విద్యాభివృద్ధిలో భాగంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలతో పాటు, తెలంగాణ మోడల్ స్కూల్ లను నిర్మిస్తున్నామని ఈ పాఠశాలల కు విద్యార్థులను తీసుకువెళ్లేందుకు బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తున్నామని, నియోజకవర్గానికి ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీలతో పాటు, నూతనంగా ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తున్నదని, రాష్ట్రంలోని మూడు కోట్ల 15 లక్షల మంది ప్రజలకు లాభం చేకూరేలా దేశంలో ఎక్కడా లేనివిధంగా ఈ పథకం అమలు చేయనుందని, ప్రమాదంలో లేదా జబ్బులతో ఎవరైనా చనిపోతే ఇందిరమ్మ జీవిత బీమా అమలవుతుందని, ఏప్రిల్ ఒకటి నుండి ఈ పథకం ప్రారంభమైనట్లు ఆయన చెప్పారు. అలాగే ఎల్ కె జి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ప్రతిరోజు అల్పాహారం అందించే కొత్త పథకాన్ని కూడా అమలు చేయనున్నామని, దివ్యంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ వాహనాలు అందిస్తున్నామని, రైతులు సేంద్రియ వ్యవసాయంతో పాటు, ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని కోరారు.తిప్పర్తి మండల కేంద్రంలో 60 లక్షలతో సిసి రోడ్లు నిర్మించడం జరిగిందని, మండలంలోని ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తున్నామని, 6 కోట్ల రూపాయలతో జూనియర్ కళాశాల మంజూరు చేసామని, 26 కోట్ల రూపాయలతో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయడం జరిగిందని, ఇందుకు సంబంధించి జీవో త్వరలో రానుందని, 15 రోజుల్లో టెండర్లు పిలిచి అన్ని సేవలు అందించేలా పీహెచ్సీ ని తీర్చిదిద్దుతామని, అలాగే కనగల్ లో సైతం పిహెచ్ సి ని మంజూరు చేసినట్లు చెప్పారు. మండలంలో గతంలో 100 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, నిధులు లేనందున మధ్యలో నిర్మాణాలు ఆగిపోయాయని, వాటికి నిధులు మంజూరు చేయిస్తామని, నెల రోజుల్లో గృహప్రవేశాలకు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను ఆదేశించారు. 100 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల గృహప్రవేశాల కోసం తన సొంతంగా ప్రతి ఇంటికి 20వేల రూపాయలు ఇస్తానని మంత్రి హామీ ఇచ్చారు. వీటితోపాటు, ఇదివరకే 130 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చామన్నారు.మండలంలో గ్రామ సమాఖ్య భవనాలను నిర్మిస్తున్నామని ,సిసి రోడ్లు, డ్రైనేజీలతో పాటు ,సాగునీరు అందించే కాలువల మరమ్మతులకు మూడున్నర కోట్ల రూపాయలు వెచ్చించి లైనింగ్ చేపట్టామని, మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ భవనం పాతబడిపోయినందున 70 లక్షల రూపాయల వ్యయంతో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించేందుకు స్థలాన్ని చూడాల్సిందిగా ఆయన జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తిప్పర్తి మండలానికి రెండు బస్సులు ఇచ్చేందుకు మంత్రి హామీ ఇచ్చారు. అలాగే పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తామని, మహిళలకు ఇదివరకే వడ్డీ లేని రుణాలు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మండలం సమాఖ్య ద్వారా 3 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు మహిళా సంఘాలు ముందుకు రాగా, అందుకు వెంటనే మంత్రి స్పందిస్తూ మహిళా సంఘాల చేత మూడు దాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డి ఆర్ డి ఓ ను ఆదేశించారు. తిప్పర్తి మండల కేంద్రానికి త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రిని తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో 100 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూములు ఇండ్లు ఇవ్వగా గతంలో నిధుల చెల్లింపుతో ఆగిపోయాయని,మంత్రి ఆదేశంతో తక్కిన నిధులను వెచ్చించి త్వరగా నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటీవలే మహిళలు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా 10 వేల కోట్ల రూపాయల మైలురాయిని అధిగమించారని ,మండలంలో 352 కొత్త రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా సన్న బియ్యం ఇస్తున్నామని, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందని, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఇందిరా మహిళ శక్తి ద్వారా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, రైతులకు రైతు భరోసా నిధులను ఇటీవల ప్రభుత్వం అందించిందని, నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ ,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు అధికారుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, స్థానికంగా సర్పంచుల వ్యవస్థ చాలా ముఖ్యమని అన్నారు. పేద కుటుంబాలకు అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ లబ్ధి అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.సమావేశానికి అధ్యక్షత వహించిన గ్రామ సర్పంచ్ రజిత రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు.ఈ సందర్భంగా రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సు, ఉచిత విద్యుత్తు, ఎల్పిజి తదితర పథకాల కింద లబ్ధి పొందిన లబ్ధిదారులు వారు పొందిన లబ్ధిని తెలియజేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జెడ్పి సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

సబ్బండ వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యం
లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దశరథ్ నాయక్

విశ్వంభర, బషీర్ బాగ్: సబ్బండ వర్గాలకు రాజ్యాధికారం, సమ సమాజ నిర్మాణమే లక్ష్యమని లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు ఎం. దశరథ్ నాయక్ తెలిపారు. గురువారం బషీర్ బాగ్‌లో ఆయన మాట్లాడుతూ, బీసీలలో, ఎస్సీలలో రెండు మూడు కులాలు తప్ప, మిగతా కులాలు రాజకీయంగా వెనుక పడ్డాయన్నారు. ఈ కులాలు రాజకీయంగా అభివృద్ధి ఎప్పుడు చెందుతాయని ప్రశ్నించారు. రాజ్యాంగపరంగా అన్ని సుబ్బండ కులాలకు ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఎంపీ స్థానాలలో సమాన వాటా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే దేశంలో సకల జనులకు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. ఇప్పటివరకు రెడ్లు, వెలమలు, బ్రాహ్మణ ఆధిపత్య కులాలే రాజకీయంగా , ఆర్థికంగా ముందు వరుసలో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు అసెంబ్లీ గేటు తాకని ఎస్సీ, బీసీ కులాలు ఎన్నో ఉన్నాయి అన్నారు. రాజకీయ పార్టీలు ఎస్సీలను, బీసీలను ఓట్లు ఓట్లు వేసే యంత్రాలు చూస్తూ వారి హక్కులు అధికారాలు లాక్కుంటున్నారని పేర్కొన్నారు. అన్ని కులాలు, మతాలు సమానమే అని రాజకీయంగా సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా సాంప్రదాయ దినోత్సవం

విశ్వంభర, మోహినాబాద్: హిమాయత్ నగర్‌లోని చైతన్య డీమ్డ్-టు-బి విశ్వవిద్యాలయం విద్యార్థులు "సాంప్రదాయ దినోత్సవం"ను అత్యంత ఉత్సాహంతో, సాంస్కృతిక స్ఫూర్తితో ఘనంగా నిర్వహించారు. భారతదేశంలోని విభిన్న సంస్కృతులు, ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహించే రంగు రంగుల సాంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు క్యాంపస్‌కు హాజరవడంతో ప్రాంగణం కళకళలాడింది. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీతం, నృత్య ప్రదర్శనలు భారతీయ సాంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చైతన్య డీమ్డ్-టు-బి విశ్వవిద్యాలయ ఫౌండర్ & ఛాన్సలర్ డాక్టర్ సి. హెచ్. పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ, "ఈ వేడుకలు విద్యార్థుల్లో తమ సంప్రదాయాల పట్ల గాఢమైన గౌరవాన్ని పెంపొందించడమే కాకుండా, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పుతున్నాయి. ఈ కార్యక్రమం విద్యార్థులకు మరపురాని అనుభవాన్ని అందించడంతో పాటు, వారి మూలాలతో మరింత అనుబంధాన్ని పెంపొందిస్తుంది" అని తెలిపారు. అనంతరం డైరెక్టర్ & చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సి. హెచ్. సాత్విక రెడ్డి మాట్లాడుతూ, నేటి ఆధునిక సమాజంలో సాంప్రదాయ విలువలను కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ఆచార్య జి. శంకర్ లింగం, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. రవీందర్, డీన్స్ ఎ. రాజు, ఎస్. కవిత, సి. హెచ్. ప్రత్యూష రెడ్డి, పి. సుగంధ దేవి, క్రిస్టోఫర్, ఎం. జగదీశ్వర్, జి. కుమారస్వామి, సి. హెచ్. సునీత, డి. దేవ్ కుమార్, పలు విభాగాధిపతులు, సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థినులు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ & పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియాలో ఘనంగా 'నాయకత్వ కార్యక్రమం'
పాల్గొన్న హరీష్ రావు, ఐలాపూర్ మాణిక్ యాదవ్

విశ్వంభర, హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా నిర్వహించిన "నాయకత్వ కార్యక్రమం" ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా జరిగింది. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్ రావు విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. యువత కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ లక్ష్యాల సాధనలో పట్టుదలతో ముందుకు సాగాలని, అప్పుడే దేశానికి గొప్ప నాయకులు అందుతారని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులతో నేరుగా ముచ్చటించిన ఆయన, వారి ఆలోచనలు మరియు అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సామాజిక బాధ్యతతో పనిచేసే ప్రతి యువకుడికి తాము అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. యువతలో దాగి ఉన్న నాయకత్వ పటిమను వెలికితీయడం, సామాజిక అంశాలపై వారికి అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించిన నిర్వాహకులను, విద్యార్థులను మాణిక్ యాదవ్ అభినందించారు. ఈ సదస్సులో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వర్సిటీ నాయకులు మరియు బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మాదిగలకు అన్యాయం చేస్తోంది
మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు



విశ్వంభర, బషీర్ బాగ్: కాంగ్రెస్ పార్టీ మాదిగలకు అన్యాయం చేస్తుందని, లోక్ సభ, రాజ్య సభలో సీట్లలో మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించలేదని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు విమర్శించారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుటుంబానికి రెండు, మంత్రి వివేక్ వెంకటస్వామి కుటుంబానికి మూడు సీట్లు ఎలా ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. మాదిగలు అంటే అంతా చిన్న చూపా? ఈ విషయంపై భట్టి విక్రమార్క , వివేక్ వెంకటస్వామి స్పందించాలన్నారు. మాదిగలకు జరుగుతున్న అన్యాయాలపై ముఖ్యమంత్రిని కలిసి మాట్లాడేందుకు ప్రయత్నించాను. కానీ ఆయన నాకు అవకాశం ఇవ్వలేదన్నారు. మాదిగలను రాజకీయ శక్తిగా ఎదిగేందుకు "మాదిగ మహా శక్తి" సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మాదిగ ఓట్లు మాదిగలకే వేసుకోవాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తాను ఇప్పటికి కాంగ్రెస్ పార్టీలోని ఉన్నాను. కాంగ్రెస్ లోనే కొనసాగుతాను అని తెలిపారు. మాదిగలకు న్యాయం చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని నర్సింహులు పేర్కొన్నారు. ఈనెల 5న బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో మాదిగ మహాశక్తి సంఘం జెండా ఆవిర్భావం చేయనున్నట్లు మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మాదిగలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయకుమార్, చిలక భాస్కర్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో పూజలు

విశ్వంభర, అంబర్‌పేట : హనుమాన్ జయంతి సందర్భంగా అంబర్‌పేట పటేల్ నగర్ చౌరస్తాలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మాజీ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. దేవస్థాన కమిటీ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ప్రసాదం అందించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, పాల్గొన్నారు.

క్రమశిక్షణ కమిటీ చైర్మన్ సుడిగాలి పర్యటన

విశ్వంభర, హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెక్రెటరీ, టిఎంబిఎండబ్ల్యూఏ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కాశ మౌని శ్యామ్ రావు ముదిరాజ్ పాతబస్తీలోని పలు హనుమాన్ ఆలయాలలో హనుమాన్ జయంతి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బుర్ర టిఎంబిఎండబ్ల్యూఏ వ్యవస్థాపక అధ్యక్షులుశ్రీనివాస్ గౌడ్ , గౌడ కమ్యూనిటీ ప్రెసిడెంట్ మోడం సుధాకర్ గౌడ్, అసోసియేషన్ ఇన్చార్జి ఏశలఈశ్వర్ నేత, మహిళా అధ్యక్షురాలు పంపరి భాగ్యలక్ష్మి గంగపుత్ర, గౌరవ అధ్యక్షులు అయిల్ల రవీందర్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ మరియు గౌడ కమ్యూనిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మలుగరి శేఖర్ గౌడ్ ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రజలకు న్యాయ సేవలు అందించాలి

విశ్వంభర , తొర్రూరు: ప్రజలకు న్యాయవాదులు న్యాయ సేవలు అందించాలని దళిత రత్న అవార్డు గ్రహీత, బేడ బుడగ జంగాల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ తూర్పాటి పాండు అన్నారు. గురువారం నూతనంగాఎన్నికైన బార్అధ్యక్షులువీరదాసు వెంకటరత్నం, ఉపాధ్యక్షుడు డి. నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శి టి. సైదులు, సంయుక్త కార్యదర్శి పల్లవి, స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీ ఎం. ఎల్లేష్, కోశాధికారి కృపావతి, సభ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా తూర్పాటి పాండు మాట్లాడుతూ, న్యాయవాదులు వివిధ కేసులలో ప్రజలకు అన్ని విధాలుగా న్యాయం జరిగేందుకు కృషి చేయాలని కోరారు.

త్వరలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు
శాసనమండలి చైర్మన్ గుత్తా

విశ్వంభర,చిట్యాల: త్వరలోనే రాష్ట్రంలో నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్లు, అర్హులైన వారందరికీ నూతన పెన్షన్లు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయం చిందని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. గురువారం చిట్యాల మున్సిపాలిటీ తో పాటు, మండలం, ఉరుమడ్ల గ్రామంలో జరిగిన గ్రామ సభకు రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ ,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్లు హాజరయ్యారు. గ్రామసభలో రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక సందర్భంగా గత రెండు సంవత్సరాలలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తూ ప్రజల సమస్యలను తీర్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని తెలిపారు.ప్రజా సంక్షేమం లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గత నెల 30న రాష్ట్ర బడ్జెట్ ను ఆమోదించుకున్న విషయం తెలిసిందేనని, రాష్ట్రంలో కొత్తగా 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు.

ఈ విడతలో ఇదివరకే బేస్మెంట్ వేసుకున్న వారికి, పిల్లర్లు వేసుకున్న వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. విద్యాభివృద్ధిలో భాగంగా నియోజకవర్గానికి ఒక తెలంగాణ మోడల్ స్కూల్ ను ఏర్పాటు చేస్తున్నామని, ఉరుమడ్ల గ్రామంలో తెలంగాణ మోడల్ స్కూల్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సీసీ రహదారులు అన్ని సౌకర్యాలు ఉన్నందున మోడల్ స్కూలును ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ వేముల వీరేశంతో కోరారు . ఉరుమడ్ల గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మించామని, రెండు అంగన్వాడీ భవనాలు పూర్తి చేశామని, రెండున్నర కోట్ల రూపాయలతో చెరువును పటిష్టం చేశామని, రెండు కోట్ల రూపాయలతో గ్రామానికి బీటీ రహదారి మంజూరు అయిందని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంస్థలను, సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రానున్న సంవత్సర కాలంలో ప్రజలకు సంబంధించి మిగిలిపోయిన సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. గతంలో గ్రామంలో 11 మంది ఎస్సీలకు భూములు ఇవ్వడం జరిగిందని, అయితే దారిలేనందున ప్రత్యామ్నాయంగా మరో భూమిని కేటాయించడం జరిగిందని త్వరితగతిన మా భూమిని లబ్ధిదారులకు ఇప్పించే ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ తో కోరారు. ప్రభుత్వ విప్ ,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి వివిధ రకాల కార్యక్రమాలు అమలు చేస్తున్నదని,6 గ్యారంటీలను అమలు చేస్తున్నదని తెలిపారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు ప్రభుత్వం మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఉరుమడ్ల గ్రామంలో చెరువులు,రహదారులు అన్నింటిని అభివృద్ధి చేసుకో వడం జరిగిందని, గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లా డుతూ మార్చి 6న ప్రారంభమైన కార్యక్రమం మార్చి 15 వరకు పరిశుభ్రత, ఫైళ్ల క్లియరెన్స్ జరిగిందని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో వివిధ పథకాల కింద లబ్ధిదారుల వివరాలను సేకరించడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఇందిరా మహిళ శక్తి పథకం ,మహిళకు ఉచిత బస్సు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పండించిన రైతులకు 500 రూపాయల బోనస్ వంటివిఇదివరకే ఇవ్వడం జరిగిందని తెలిపారు. పాఠశాల, ఇంటర్‌విద్యార్థులకు అల్పాహారం, ప్రజలకు జీవిత బీమా పథకం, దివ్యాంగులకు మోటారు బ్యాటరీ సైకిళ్లు, రైతులకు మేలైన వంగడాలు ఇస్తున్నామని, ఆయా పథకాల కింద లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలన్నిటిని, సచివాల యంలో వెల్లడిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాష్ నేత , చిట్యాల మున్సిపల్ చైర్మన్ పందిరి గీత రమేష్, తహసిల్దార్ బకతట్ల విజయ, ఎంపీడీవో జయలక్ష్మి, మార్కెట్ చైర్మన్ నర్ర వినోద, సర్పంచ్ సాగర్ల భాను శ్రీ ,పల్లపు బుద్ధుడు, కోనేటి యాదగిరి. ఉరుమడ్ల గ్రామ శివారులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

రామన్నపేటలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

విశ్వంభర, రామన్నపేట:తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో గురువారం రోజు నుండి ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని రామన్నపేట గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేయగా ఆ సభకు మండల ఎంపీడీఓ, మండల తహసిల్దార్, వివిధ శాఖల మండల అధికారులు, గ్రామ పాలక మండలి, గ్రామస్తులు హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా పాలనలో ప్రజల భాగస్వామ్యం పెంపు, ప్రభుత్వ పథకాలపై చర్చ, లబ్ధిదారుల అభిప్రాయ సేకరణ, గ్రామ అభివృద్ధి అవసరాల గుర్తింపు పరిష్కారాలపై చర్చ, పథకాల అమలులో పారదర్శకత పెంపు వంటి అంశాలపైన గ్రామ సభలో చర్చించడం జరిగింది. ప్రభుత్వం అందించే పథకాలు సద్వినియోగం చేసుకోవాలని తెలియచేయడం జరిగింది. అలాగే మండలంలో అన్ని గ్రామాల్లో కూడా గ్రామ సభలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామ ప్రత్యేక అధికారులు, గ్రామ పాలక మండళ్ళు, గ్రామస్తులు తదితరులు హాజరు కావడం జరిగింది.

కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించుకోవాలి

విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో గురువారంరోజు తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 316 వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. అనంతరం కల్లుగీత కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ, పాపన్న పోరాట స్ఫూర్తితో కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి

విశ్వంభర, రామన్నపేట:యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి కార్యక్రమం నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీఓ ఆవుల రాములు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కూడా సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి తహసిల్దార్ లాల్ బహదూర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు వాల్ పోస్టర్ ఆవిష్కరణ

విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో రామన్నపేట నియోజకవర్గ సాధన కోసం శుక్రవారం రోజు ఉదయం 10 గంటలకు జరిగే వాల్ పోస్టర్ ఆవిష్కరణకు నియోజకవర్గ సాధన కమిటీ సభ్యులు, విద్యావేత్తలు యువకులు, విద్యార్థులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య ఒక ప్రకటనలో కోరారు.పోస్టర్ ఆవిష్కరణను విజయవంతం చేసి మన రామన్నపేట నియోజకవర్గ సాధన ను ముందుకు పోవుటకు జరిపే కార్యక్రమాలకు సహకరించగలరని ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేస్తున్నామని రామన్నపేట నియోజకవర్గ సాధన కమిటీ తరపున కమిటీ అధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య ఒక ప్రకటనలో కోరారు.